వర్షాలతో దెబ్బతింటున్న ఉల్లి పంట

- తోటలలో నిలిచిన వర్షపు నీరు
- ఉల్లి గడ్డలు కుళ్లిపోయే ప్రమాదం
- ఇలాగైతే నష్టపోతామంటున్న ఉల్లి రైతులు

వేముల : ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉల్లి పంట వర్షాలతో దెబ్బతింటోంది. వారం రోజులుగా ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ఉద్యాన పంటలలో ఉల్లి సున్నితమైన పంట. ఈ పంటకు వర్షాలు ఎక్కువైనా నష్టమే, ఆ నీటితడులు ఇవ్వకపోయినా నష్టమే. ఈ పంటకు తగినంత తేమ శాతం ఉండాలి, తేమ శాతం ఎక్కువైతే తెగుళ్లు పంటపై దాడి చేస్తాయి. తేమ శాతం తక్కువగా ఉంటే పంట ఎండిపోయే ప్రమాదం లేకపోలేదు. దీంతో రైతులు వారం రోజులుగా వర్షాలు పడుతుండటంతో ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఉల్లి సాగు చేసి 80 రోజులు కావస్తోంది. మరో 30 రోజులలో ఉల్లిలో దిగుబడులు వస్తాయి. ఈ సమయంలో భారీ వర్షాలు కురిస్తే పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఉల్లిలో తేమ శాతం ఎక్కువగా ఉంది. ఈ దశలో తెగుళ్లు సోకితే మందులు స్ప్రే చేసినా నివారించలేమని రైతులు అంటున్నారు.

తోటలలో నిలిచిన వర్షపు నీరు

ఉల్లి పంటపై రైతుల ఆశలను వర్షాలు చిదిమేస్తున్నాయి. తోటలలో వర్షాలు నీరు నిల్వ ఉండటంతో ఉల్లి పంట కుళ్లిపోయే ప్రమాదం ఉంది. పులివెందుల నియోజకవర్గంలో 4 వేల ఎకరాలకుపైనే ఉల్లి సాగైంది. అయితే వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకంటే రెండు రోజులుగా కురుస్తున్న తుఫాన్ వర్షాలే ఉల్లి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. కొంతమంది రైతులు ముందస్తుగా ఉల్లి సాగు చేశారు. అలాంటి రైతులు మరో రెండు వారాల్లో ఉల్లి గడ్డలను పీకి వేయాల్సి ఉంది. ఇలా వర్షపు నీరు నిల్వ ఉండటంవలన ఉల్లి గడ్డలు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు అంటున్నారు.


ఉల్లి పంటలో నిలిచిన వర్షపు నీరు

వర్షాలతో ఉల్లి గడ్డలు కుళ్లిపోయే ప్రమాదం :

తుఫాన్ వర్షాలు ఉల్లి పంటకు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. అధిక వర్షాలతో తోటలలో వర్షపు నీరు నిలిచింది. నీరు ఎక్కువైతే ఉల్లిగడ్డలు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. తోటలలో వర్షపు నీరు నిల్వ లేకుండా చేస్తున్నా రోజు వర్షాలు పడటంతో రైతులకు సాధ్యం కాలేదు. రాత్రివేళ వర్షం పడటం, పగలు ఎండలు వస్తున్నా. గత రెండు రోజులుగా తుఫాన్‌తో రాత్రింబవళ్లు వర్షాలు పడుతుండటంతో నీరు నిల్వ లేకుండా చేసే పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. నాలుగు నెలలపాటు పడిన కష్టమంతా వృథా అవుతోందని రైతులు వాపోతున్నారు.


నారేపల్లె వద్ద సాగులో ఉన్న ఉల్లి పంట

5ఎకరాలలో ఉల్లి సాగు చేశా



నాకున్న 5 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. సాగుకు రూ.3 లక్షలకుపైనే పెట్టుబడి పెట్టా. మరో 30 రోజులలో పంట చేతికొస్తుంది. ఈ దశలో వర్షాలు పడితే పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. దీనివల్ల దిగుబడులు తగ్గి సాగులో తీవ్రంగా నష్టపోతాం. ఇలాగే వర్షాలు కురిస్తే సాగులో పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉంటుంది.

– రామగంగిరెడ్డి, ఉల్లి రైతు, నారేపల్లె

వర్షాలతో తీవ్రంగా నష్టపోతాం



తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతాం. నాకున్న 3 ఎకరాలలో ఉల్లి సాగు చేశా. ముందుగా సాగు చేయడంతో మరో 20 రోజులలో దిగుబడులు రానున్నాయి. ఈ దశలో ఎడతెరిపిలేని వర్షాలతో తోటలలో ఉల్లిగడ్డలు కుళ్లిపోతాయి. మరో నాలుగు రోజులు వర్షాలు వస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో పంటను కాపాడుకునే పరిస్థితి లేదు.

– వెంకటశివారెడ్డి, ఉల్లి రైతు, నారేపల్లె

ఈ వర్షాలతో ఉల్లికి నష్టంలేదు



ఉల్లి పంటకు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నష్టంలేదు. భారీ వర్షాలు కురిసి ఉల్లి తోటలలో నీరు నిల్వ ఉంటే పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. నీరు నిల్వ ఉండటం వల్ల పంటకు మజ్జిగ తెగులు సోకే ప్రమాదం ఉంది. తుఫాన్‌తో మరో నాలుగు రోజులు వర్షాలు కురిస్తే ఉల్లి పంటకు నష్టమే.

– రాఘవేంద్రారెడ్డి, హెచ్‌ఓ, పులివెందుల

క్లుప్తంగా

ఆర్టీసీ డిపోను లులూ కంపెనీకి కట్టబెట్టడం అన్యాయం


డిపో గ్యారేజ్ వద్ద గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న కార్మికులు

జమ్మలమడుగు : గవర్నర్‌పేట–2 డిపోను లులూ అనే ప్రైవేట్ సంస్థకు కట్టబెడుతూ ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని డిపో వర్కింగ్ అధ్యక్షుడు ఓబుళరెడ్డి, కడప రీజనల్ చైర్మన్ శేషన్నలు కోరారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ ఎన్‌ఎంయూ ఇచ్చిన పిలుపు మేరకు డిపో ఆవరణలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగస్తులకు తక్షణమే పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 8 వేల పోస్టులకు వెంటనే భర్తీచేసి సీనియారిటీ ఉన్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను స్వయంగా ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు వలి, మోహన్‌రెడ్డి, బ్రహ్మం, శివుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆదాయం


తేనేటీగల పెంపకం గురించి వివరాలను సేకరిస్తున్న అధికారులు

జమ్మలమడుగు : ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని డీపీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న వరప్రసాద్ అనే రైతు సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోపాటు తేనే టీగల పెంపకాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. శనగపంట సాగుచేసే రైతులతో సీఎండీసీ వేయించాలన్నారు. రైతులు రసాయన ఎరువులకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయం వైపు రావాలన్నారు. శనగ పంట రైతులకు 30 రకాల విత్తనాలతో పీఎండీసీ చేయించాలని సిబ్బందికి సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెరిగి దిగుబడి పెరగడంతోపాటు నాణ్యమైన పంట వస్తుందన్నారు. అనంతరం డీపీఎం ద్వారా సాగుచేసే పంటల ఆదాయం గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువుతో వరిపైరుకు మేలు


పంట సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

: ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేసే రైతులు నాటకముందే జనుము, జీలుగా వంటి పచ్చిరొట్టె పైరు వేసి 35 రోజుల తర్వాత భూమిలో కలియదున్నడంతో పచ్చిరొట్టె ఎరువు వరి పైరుకు మంచి దిగుబడితో పాటు మేలు జరుతుందని మండల వ్యవసాయ అధికారి రామంజులరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పి.అనంతపురం, ఏటూరు గ్రామాల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వరిపంటలో తూర్పు–పడమరగా కాలిబాటలు తీయాలన్నారు. దీని ద్వారా దోమపోటును నివారించడమే కాకుండా పంటకు గాలి వెలుతురు బాగా తగిలి దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఈఓ రమేష్ రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వల్ల అన్నీ అనర్థాలే

చింతకొమ్మదిన్నె : మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందని వికలాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్‌వీ కృష్ణకిశోర్ తెలిపారు. బుధవారం కడప నగరం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నషా ముక్త భారత్ అభియాన్ (మత్తు రహిత భారత దేశ ఉద్యమం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు అలవాటు పడితే మానసిక వికాసమే కాదు శారీరక ఆరోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ఏడీ కృష్ణకిశోర్, కడప రిహాబిలిటేషన్ ఆఫీసర్ శ్రీకాంత్, కడప ఈగల్ టీం సభ్యులు పి.ఆయుబ్‌ఖాన్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా విద్యార్థికి ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప ఐటీఐ వద్ద ఉన్న భాష్యం స్కూల్‌కు చెందిన వెంకట భవితేజన్‌రెడ్డి నేషనల్ ఆస్ట్రానమి, సైన్సు ఒలంపియాడ్(ఎన్‌ఎస్‌ఓ)లో అఖిల భారతస్థాయిలో 51వ ర్యాంకు సాధించి జాతీయస్థాయిలో ప్రతిభచాటాడు. ఈ విజయాన్ని పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ నివాసం రాజ్‌భవన్‌లో ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవం రోజు జరిగే ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా విద్యార్థికి ప్రత్యేక ఆహ్వానం అందినట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ


అధ్యాపకులు, విద్యార్థినిలచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నషముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతిజ్ఞలో యువత దేశానికి వెన్నెముక లాంటి వారన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం చేయకుండా, జీవితంలో తప్పుదోవలో ప్రయాణించకుండా చైతన్యం కల్పించాలన్నారు. మానసికంగా, శారీరకంగా, సామాజికంగా ఆరోగ్యంగా ఉండి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ వంతు పాత్రను నిర్వహిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బాల నారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెమి కండక్టర్ ప్రాజెక్ట్‌ను కొప్పర్తిలో నిర్మించాలి

కడప ఎడ్యుకేషన్: సెమి కండక్టర్ ప్రాజెక్ట్‌ను కడప కొప్పర్తి పారిశ్రామిక వాడలో నిర్మించాలని పిఆర్ ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కడపలోని పిఆర్‌ఎస్ వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాన్ని పూర్తిచేయాలి

ముద్దనూరు : వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి లక్ష్యాన్ని పూర్తిచేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఉమామహేశ్వరకుమార్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని ముద్దనూరు, తిమ్మాపురం, నల్లబల్లె గ్రామాల్లో ఆరోగ్యకేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిసచివాలయం పరిధిలో టీకాల కార్యక్రమాన్ని నిర్వహించాలని, ప్రతి వ్యాక్సిన్ అందుబాటులో వుండాలని, గర్భిణికి, పుట్టిన ప్రతి బిడ్డకు వ్యాధి నిరోధక టీకాలు వేయాలని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే మాతాశిశుసంరక్షణ కార్డుల్లో పూర్తి సమాచారాన్ని నమోదుచేయాలన్నారు. ఎంఆర్–2 వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా కమ్యూనిటీ హెల్త్ అధికారి మనిరెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రవైద్యురాలు కరిష్మా, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాను జయప్రదం చేయండి

వేంపల్లె : అజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలిహరిప్రసాద్ జాతీయ జెండాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాతీయ జెండా అనేది కులం, మతం వర్గం అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఎందరో మహానుభావుల బలిదానంవల్ల మనకు స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. జాతీయ జెండాను మనం చూసినప్పుడు ఈ దేశమ్ కోసం ఏదైనా చేయాలనే భావన మనలో కలుగుతుందన్నారు. ఒకే దేశం, ఒకే జెండా, ఒకే రాజ్యాంగం ఉండాలని దేశం కోసం బలిదానమైన శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఇదే నివాళి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


జాతీయ జెండాలతో బీజేపీ నాయకులు

కృష్ణాష్టమికి సిద్ధమవుతున్న దేవాలయం

సింహాద్రిపురం : స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం ఈనెల 16వ తేదీన జరిగే శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సిద్ధమవుతోంది. ఆలయ నిర్వాహకులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. శనివారం ఉదయం వేణుగోపాలస్వామికి పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, విశేష పూజలు, వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అలాగే కోలాటం, చెక్కభజన, తాళాల భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమాలలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.


శ్రీకృష్ణాష్టమి వేడుకలకు సిద్ధమవుతున్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయం

వృద్ధులకు మెరుగైన సేవలు

వేంపల్లె : ఫిజియోథెరపీ పరికరాలతో వృద్ధులకు మెరుగైన సేవలు అందించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజామొహిద్దీన్ తెలిపారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా బుధవారం పీహెచ్‌సీ సిబ్బంది, నర్సులకు స్ట్రెస్ మేనేజ్‌మెంట్, ఫిజియోథెరపీపై ఆయన ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి విష్ణు ఏపిడెమాలజిస్ట్, ఎన్సీడీని ప్రారంభోత్సవం చేసి, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణలో నర్సుల పాత్ర కీలకమన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కేంద్రాల్లో జెరియాట్రిక్ క్లినిక్‌లను ప్రారంభించిందన్నారు. ఈ క్లినిక్‌లలో వృద్ధులకు అత్యాధునిక ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు స్టేషనరీ సైకిల్, ఐఆర్‌ఆర్ ల్యాంప్, వాకర్స్, షోల్డర్ వీల్, గైట్ ట్రైనర్ వంటి ఆధునిక పరికరాలు సమకూర్చారు. పరికరాల వినియోగం, రోగులకు ఉపయోగాలు వివరించే విధానంపై డాక్టర్ దీప సమగ్ర శిక్షణ ఇచ్చారు. అదే విధంగా, మానసిక ఆరోగ్యం దృష్ట్యా స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై డాక్టర్ కవిత నర్సులకు ప్రత్యేక సూచనలు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీ నర్సులు పాల్గొన్నారు.


స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై సూచనలిస్తున్న డాక్టర్ కవిత

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ–కం–సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ యామిని సూచనల మేరకు కడప శివార్లలోని కె ఎస్ ఆర్ ఎం ఇంజనీరింగ్ కళాశాలలో నల్సా పథకాలపై 'న్యూ మాడ్యూల్ లీగల్ సర్వీసెస్ క్యాంపు' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నల్సా (అక్రమ రవాణా, వాణిజ్య లైంగిక దోపిడీ బాధితులు) పథకం 2015, నల్సా (పిల్లల కోసం పిల్లల–స్నేహపూర్వక చట్టపరమైన సేవలు) పథకం 2024, అలాగే లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, మధ్యవర్తిత్వం, ఉచిత న్యాయ సహాయం, ప్రాథమిక హక్కులు, విధులు, విద్యాహక్కు, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ 1987, 357 ఏసిఆర్‌పిసి, బాల్య న్యాయ చట్టం, పోక్సో చట్టం, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం, శిశు సంక్షేమ కమిటీ విధులు, శిశుగృహ విధులు, భారత రాజ్యాంగం, ఆర్టికల్ 21, 1098 హెల్ప్ లైన్, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 181, న్యాయ సహాయం కోసం హెల్ప్‌లైన్ – 15100, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 మొదలు అంశాలను తెలియజేశారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్

స్టాల్స్ ఏర్పాటు: జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, డిస్ట్రిక్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, వన్ స్టాప్ సెంటర్, వైద్య ఆరోగ్యశాఖ, కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ వారు స్టాల్స్ లను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌ల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కందుల గ్రూప్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, అడిషనల్ డిస్ట్రిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రవిబాబు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణ అప్రజాస్వామికం

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్‌రెడ్డి డిమాండ్

కమలాపురం : ఈనెల 12వ తేదీన జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలు అప్రజాస్వామికం అని, సభ్య సమాజం తలదించుకునేలా నిర్వహించారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్, పోలీస్ సిబ్బందిపై ఈసీ దృష్టి సారించి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దొంగ ఓట్లను కట్టడి చేయాల్సిన పోలీసులే రిగ్గింగ్‌ను ప్రోత్సహించారని మండి పడ్డారు. పోలీసులు ఓటర్ల స్లిప్పులు లాక్కొని కూటమి గుండాలకు ఇవ్వడం దారుణం అన్నారు. తమ ఓట్లు తాము వేసుకుంటామని ప్రజలు పోలీసుల కాళ్లు పట్టుకుని ప్రాధేయపడాల్సిన పరిస్థితి దాపురించిందని, ఇలాంటి ఎన్నికలు గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వం మొదటి ఏడాదిలో పింఛన్లు తప్ప ఏ పథకం అమలు చేయలేదన్నారు. రెండో ఏడాడి తల్లికి వందనం రూ.15 వేలు చెప్పి రూ.13 వేలతోనే సరిపెట్టిందన్నారు. దాదాపు 20 లక్షల మంది తల్లులకు ఎగనామం పెట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు అన్నారని, ఇపుడేమో 5 రకాల బస్సుల్లోనే ఉచితం అంటున్నారని, ఇలా ఏ పథకం పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. దీంతో ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే దమ్ము ధైర్యం లేక దొంగ ఓట్లు వేసుకోవడానికి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేసి, ఓటర్లపైనే కూటమి నాయకులు దాడులకు దిగడం దారుణం అన్నారు. అయితే భవిష్యత్తులో ఇంతకు ఇంత, పదింతలు అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. రెండు స్థానాల్లో 30 పోలింగ్ బూతులు, 35 వేల ఓటర్లు ఉండగా 15 వేల మంది పోలీసులన నియమించడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒంటిమిట్ట కడప డివిజన్ పరిధిలోకి వస్తుందని, అయితే ఆ కేంద్రంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ వచ్చి తన సిబ్బందిని తెచ్చి రిగ్గింగ్‌కు కీలక పాత్ర పోషించారన్నారు. పోలింగ్ సిబ్బంది కూడా కూటమి ప్రభుత్వానికి సహకరించారని, వారిపై కూడా ఈసీ చర్యలు తీసుకోవాలన్నారు. పులివెందులలో ఓటింగ్ జరుగుతుంటే అక్కడ కమలాపురం, జమ్మలమడుగు ప్రజలకు పనేముందని ఆయన ప్రశ్నించారు. తాము దొంగ ఓట్లు వేశామని పెద్దచెప్పలికి చెందిన టీడీపీ నాయకులు సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియాలో స్టేటస్ పెట్టుకున్నారని, పోలీస్ వ్యవస్థ, ఈసీ ఏమి చేస్తోందని ఆయన ప్రశ్నించారు. పులివెందులలో దొంగ ఓట్లు వేయడానికి కూడా టీడీపీకి దిక్కు లేక పక్క నియోజకవర్గాల నుంచి దొంగ ఓటర్లను దిగుమతి చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఏజెంట్‌గా కూర్చునే వారిపై బైండోవర్ కేసులు పెట్టి, వారి ఇళ్లకు వెళ్లి మహిళలను భయ భ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు సమంజసం అన్నారు. అధికార మదంతో కూటమి నాయకులు ఇష్టం వచ్చినట్లు ప్రవరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, మహ్మద్ సాదిక్, సుధా కొండారెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డి, సత్యంరెడ్డి, శరత్‌బాబు, జావీద్, సరోజ, హాజిమా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేన్ రామాంజులరెడ్డి

నూతన నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న ఎంహెచ్‌పీఎస్ పులివెందుల కమిటీ అధ్యక్షుడు మహబూబ్‌బాషా

వేంపల్లె : మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి పులివెందుల నియోజకవర్గం కమిటీ అధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన మహబూబ్‌బాషాను నియమించారు. బుధవారం విజయవాడలోని స్థానిక మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో వేంపల్లెకు చెందిన 10 మందిని పులివెందుల కమిటీ సభ్యులుగా నియమించడం జరిగింది. ఈ నేపథ్యంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ షిబ్లీ కమిటీలో సభ్యులుగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. సందర్భంగా అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, వైస్ ప్రెసిడెంట్‌గా కరీముల్లా, సెక్రటరీగా దర్బార్‌వలి, జాయింట్ సెక్రెటరీగా పాలగిరి గౌస్ పీర్, మీడియా కో ఆర్డినేటర్‌గా సయ్యద్‌సమీర్‌లు ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ షిబ్లీ చెప్పారు. అలాగే సభ్యులుగా కె.ఎస్.కరీముల్లా, మొహమ్మద్ గౌస్, అమీరుద్దీన్, బాబా ఫక్రుద్దీన్‌లను నియమించినట్లు తెలిపారు.

జ్ఞానాన్ని అందించే కేంద్రాలు గ్రంథాలయాలు

వేంపల్లె : గ్రంథాలయాలు పుస్తకాల బాండగారం మాత్రమే కాకుండా చదవడానికి, పరిశోధనకు, ఆలోచనలకు ప్రేరణ కలిగించే జ్ఞానాన్ని అందించే విద్యా కేంద్రాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ వివేకానంద డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ పితామహుడు డాక్టర్ సీయాలి రామామృత రంగనాథన్ జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రంథాలయ శాఖ అధిపతి మాధవరావు సమావేశం ఏర్పాటు చేశారు. రంగనాథన్ ఒకవైపు స్వతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొనడంతో పాటు ప్రజలకు జ్ఞానాన్ని పెంపొందించే గ్రంథాలయ స్థాపనకు విశేష కృషి చేశారన్నారు. ప్రస్తుతం లక్షలాది గ్రంథాలయాలు ఆవిర్భవించి కోట్లాదిమంది ప్రజలను విద్యావంతులు, అక్షరాస్యులు, జ్ఞానవంతులు, పరిశోధకులుగా మార్చుతున్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీరంగనాథన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ నాగేంద్ర

ఉపాధ్యాయులకు సన్మానం

చక్రాయపేట : మండలంలోని కుప్పం గ్రామం బురుజుపల్లె ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన రామకృష్ణారెడ్డి, అలాగే బదిలీపై వెళ్లిన శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య అనే ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర నాయకులు ఎరుకలరెడ్డి, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, భోగేశ్వరయ్య, శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.


సన్మానం పొందిన వారితో ఉపాధ్యాయులు

ఆగని వర్షంతో రోడ్లు ఛిద్రం

కమలాపురం : వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు ఛిద్రంగా మారాయి. ఎడతెరపి లేని వర్షాలకు రహదారులు జలమయం అయ్యాయి. ఇప్పటికే గుంతలుగా ఉన్న రోడ్లు ఈ వర్షంతో మరింత పెద్దవయ్యాయి. దీంతో వాహన చోదకులు, పాదాచారులు వాటి ద్వారా ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కమలాపురం క్రాస్ రోడ్డు ఆర్బీ వద్ద, చిన్నచెప్పలి, నసంతపురం, లేటపల్లె, వెంకటాపురం, ఎర్రగుడిపాడు, గంగవరం, విభరాపురం, పందిళ్లపల్లె తదితర గ్రామాలకు వెళ్లే రహదారుల్లో చాలా చోట్ల మోకాలు లోతు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఇటీవల క్రాస్ రోడ్డులోని ఆర్బి వద్ద ఉన్న గుంతలో వాహన చోదకుడు మునీంద్ర కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చిన్నచెప్పలి వద్ద రహదారిపై ఏర్పడిన గుంత


లేటపల్లె వెళ్లే రహదారిలో ఏర్పడిన పెద్ద గుంత